గందరగోళంగా జల్లి గ్రామసభ

ఎమ్మెల్యే మనుషులమంటూ కాంగ్రెస్ నేతల బెదిరింపు

అధికారులతో వాగ్వాదం చేస్తున్న కాంగ్రెస్ నేతలు

చెన్నారావుపేట, మార్చి 29: మండలంలోని జల్లిలో శనివారం జరిగిన గ్రామసభ గందరగోళంగా మారింది. ప్రత్యేక అధికారి డాక్టర్ మంజీలాల్ అధ్యక్షతన సభ నిర్వహించారు. గ్రామంలో చేపట్టిన నిర్మాణాలకు సంబంధించి తీర్మానాల విషయంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామస్తులకు మధ్య వాగ్వాదం జరిగింది. ఇటీవల కాంగ్రెస్ నాయకులు గ్రామంలోని ఓ ప్రాంతంలో ప్రహరీ నిర్మాణం చేపట్టారు. దానికి సంబంధించి తీర్మానం ఇవ్వాలని కోరగా గ్రామస్తులు అడ్డుపడ్డారు. చెరువు శిఖం భూమిలో అక్రమంగా ప్రహరీ నిర్మించారని, ఇలాంటి నిర్మాణానికి బిల్లుల కోసం తీర్మానం ఇవ్వొద్దని గ్రామస్తులు లిఖితపూర్వకంగా ప్రత్యేక అధికారికి లేఖ అందజేశారు. లేఖ ఆధారంగా విచారణ చేస్తామని అధికారులు తెలపగా, తమకు తీర్మానం ఇవ్వాల్సిందేనని కాంగ్రెస్ నాయకులు పట్టుబట్టారు. తాము ఎమ్మెల్యే మనుషులమని, తాము చెబితే ఎమ్మెల్యే చెప్పినట్లేనని గ్రామస్తులను బెదిరింపులకు గురిచేసి అధికారులతో వాగ్వాదానికి దిగారు. దీంతో పోలీసులు నిలువరించారు. అనంతరం రెవెన్యూ అధికారులు గ్రామంలో పౌర హక్కుల దినోత్సవం నిర్వహించారు.

టీటీడీ ఆధ్వర్యంలో ఉగాది పంచాంగ శ్రవణం

పోచమ్మమైదాన్, మార్చి 29: తిరుమల తిరుపతి దేవస్థానం హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా విశ్వాస నామ సంవత్సర ఉగాది పంచాంగ శ్రవణం నిర్వహించనున్నట్లు కార్య నిర్వాహకుడు రామిరెడ్డి కృష్ణమూర్తి తెలిపారు. శనివారం హనుమకొండలోని టీటీడీ కల్యాణ మండపంలో ప్రచార బ్యానర్‌ను ఆవిష్కరించారు. కల్యాణ మండపంలో శఠగోపాచార్యులు ఆదివారం సాయంత్రం 5 గంటలకు పంచాంగ శ్రవణం చేస్తారన్నారు. హంటర్‌రోడ్డులోని అభయాంజనేయస్వామి ఆలయం, ములుగు మండలం చిన్నగుంటూరుపల్లిలోని శ్రీసీతారామచంద్రస్వామి ఆలయం, జనగామ జిల్లా పెద్దమడూరులోని నాగేంద్రస్వామి ఆలయం, జయశంకర్ భూపాలపల్లిలోని సద్గురు గీత మందిరం, మహబూబాబాద్ జిల్లా గార్ల మండలం సీతంపేటలోని సీతారామచంద్రస్వామి ఆలయంలో పంచాంగ శ్రవణాలు జరుగుతాయని వివరించారు. అలాగే, సహృదయ సాహిత్య సాంస్కృతిక సంస్థ వరంగల్ ఆధ్వర్యంలో హనుమకొండ వడ్డేపల్లి రోడ్డులోని పీఆర్‌రెడ్డి ఫంక్షన్ హాల్‌లో ఉగాది వేడుకలు నిర్వహించనున్నట్లు సంస్థ అధ్యక్షుడు గిరిజామనోహర్ బాబు, ప్రధాన కార్యదర్శి కుందావజ్జల కృష్ణమూర్తి తెలిపారు.

అంబేద్కర్‌నగర్ గుడిసెవాసులకు పట్టాలివ్వాలి

సమావేశంలో మాట్లాడుతున్న కుమారస్వామి

నర్సంపేట, మార్చి 29: ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసుకున్న నిరుపేదలకు ప్రభుత్వం వెంటనే ఇళ్ల పట్టాలు ఇవ్వాలని ప్రజాస్రంట్ జిల్లా అధ్యక్షుడు జనగాం కుమారస్వామి కోరారు. పట్టణంలోని పాత తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో ఎమ్మెస్పీ, డీబీఆర్‌పీఎస్ ఆధ్వర్యంలో శనివారం రిలే నిరాహార దీక్షలు నిర్వహించారు. అంబేద్కర్‌నగర్‌లో నిరుపేదలు గుడిసెలు వేసుకొని నాలుగేళ్ల నుంచి నివాసం ఉంటున్నట్లు తెలిపారు. వారికి మౌలిక వసతులు కల్పించి పట్టాలు ఇవ్వాలని కోరారు. దీక్షల్లో ఎమ్మార్పీఎస్ జాతీయ ప్రతినిధి కల్లెపల్లి ప్రణయ్‌దీప్, డీబీడీపీఎస్ ప్రజా దండోరా జాతీయ అధ్యక్షుడు అందె రవి, మహాజన సోషలిస్టు పార్టీ రాష్ట్ర నాయకుడు విజయ్, ఎంఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు చింతం సిద్దూ, వీహెచ్ జిల్లా అధ్యక్షుడు బాబు రాజు పాల్గొనారు.

చివరి తడి కోసం అన్నదాత దిగాలు

- సాగునీరందక రైతుల అవస్థలు
- కళ్లెదుటే ఎండిపోతున్న వరి పంట

రాయపర్తి, మార్చి 29: అన్నదాత ఆరుగాలం కష్టించి సాగు చేసిన వరి పొలాలు చివరి తడి అందక ఎండిపోతున్నాయి. మండలంలోని తిర్మలాయపల్లి, గన్నారం, తెట్టెకుంటతండా, జింకురాంతండా, కేశవాపురం, ఎర్రకుంట తండా, ఆరెగూడెం, కొండూరు, బురహాన్‌పల్లి, కాట్రపల్లి, పోతిరెడ్డి, కొలన్‌పల్లి, జయరాంతండా(కె), వాంకుడోతుతండా, పన్యానాయక్‌తండా, కిష్టాపురంతో పాటు రాయపర్తిలోని కొన్ని ప్రాంతాల్లో భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయి. దీంతో వ్యవసాయ బావుల్లో నీరు లేక, బోరు బావులు వట్టిపోతుండడంతో చేతికందే దశలో వరి పంట ఎండిపోతుండడంతో రైతులు గుండెలవిసేలా రోదిస్తున్నారు. కేసీఆర్ పాలనలో భూగర్భ జలాలు సంపూర్ణంగా ఉండడంతో బావుల్లో పూడిక తీసే క్రేన్లు మూలనపడ్డాయి. ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పుణ్యామాని వ్యవసాయ బావుల్లో పూడికలు తీయడంతోపాటు లోతుగా తవ్వించేందుకు మళ్లీ క్రేన్ల యాజమాన్యాలను బతిమిలాడే కాలం వచ్చి పడిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రాయపర్తి శివారులో ఎండిపోయిన వరి పొలాన్ని చూపిస్తున్న రైతు మల్లయ్య

పంట ఇంటికొస్తదో రాదో..

యాసింగిలో సాగు చేసిన వరి, యక్కజొన్న, పజ్జొన్న పంటలు ఇంటికొచ్చే పరిస్థితులు కనబడ్డ లేవు. బోర్లు, బాయిలళ్ల నీళ్లన్నీ రోజురోజుకూ ఇంకిపోతానయ్. ఉత్తర గాడ్పులు ఊటగా దోల్తాంది. దీంతో ఇప్పుడు పారిచ్చిన వరి పంట కాసేపటికే ఎండిపోయి నెర్రెలు వారుతున్నాయి. మా ఊరు మీదికెళ్లే పెద్ద కాల్వ పోతాంది. కానీ, మా బోర్లళ్ల నీళ్లు మాత్రం వస్తలేవు. కేసీఆర్ సారు ఏం మాయ చేసిండో ఏమో గాని ఎవుసాయానికి పదేండ్లుగా నీళ్లు పుష్కలంగా ఉండే. ఇప్పుడు పరిస్థితి దారుణంగా ఉంది.

– చందు రాజకుమారి, మహిళా రైతు

గిర్మాజీపేట: రంజాన్ సంబురాల్లో పాల్గొన్న నన్నపునేని

మత సామరస్యానికి ప్రతీక రంజాన్

గిర్మాజీపేట, మార్చి 29: మత సామరస్యానికి ప్రతీక రంజాన్ అని, ముస్లింలు వేడుకలను కుటుంబ సభ్యులతో కలిసి ఆనందంగా జరుపుకోవాలని మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ కోరారు. శుక్రవారం రాత్రి ఆయన ముస్లింలతో కలిసి రంజాన్ సంబురాల్లో పాల్గొన్నారు. లక్ష్మీటాకీసు నుంచి పోచమ్మమైదాన్ సెంటర్ వరకు ముస్లింలతో కలిసి పాదయాత్ర నిర్వహించారు.

వన్‌టైం సెటిల్‌మెంట్‌ను వినియోగించుకోవాలి

వరంగల్, మార్చి 29: ఆస్తి పన్ను చెల్లింపుల్లో వన్ టైం సెటిల్‌మెంట్ స్కీమ్‌ను లబ్ధిదారులు వినియోగించుకోవాలని, అపరాధ రుసుముపై 90 శాతం రాయితీ అవకాశాన్ని పొందాలని కమిషనర్ అశ్వినీ తానాజీ వాకడే ఒక ప్రకటనలో కోరారు. ఈ నెల 31తో రాయితీ గడువు ముగుస్తుందన్నారు. 30, 31న సిటిజన్ సర్వీస్ సెంటర్లు, మీసేవ కేంద్రాలు పని చేస్తాయన్నారు. జీడబ్ల్యూఎంసీ మొబైల్ యాప్ ద్వారా లేదా https://gwmc.gov.in లేదా cdmataxenquiry.aspx పన్ను చెల్లించొచ్చని సూచించారు.

నేటి నుంచి వసంత నవరాత్రి ఉత్సవాలు

వరంగల్, మార్చి 29: భద్రకాళీ ఆలయంలో ఆదివారం నుంచి వసంత నవరాత్రి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఈవో శేషుభారతి తెలిపారు. ఉదయం 4 గంటలకు పూర్ణాభిషేకంతో వసంత నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. లక్ష పుష్పార్చనలో పాల్గొనే భక్తులు ఆలయ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. నేడు సాయంత్రం 6 గంటలకు బ్రహ్మశ్రీ ఐనవోలు రాధాకృష్ణ శర్మ ఆధ్వర్యంలో పంచాంగ శ్రవణం ఉంటుందన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

వరంగల్‌చౌరస్తా, మార్చి 29: దేశాయిపేట శ్మశాన వాటిక వద్ద పేకాట శిబిరంపై శుక్రవారం రాత్రి ఇంతేజార్‌గంజ్ పోలీసులు దాడులు నిర్వహించారు. సోమల సంపత్, పొగాకు రామకృష్ణ, తిప్పని వేణు, ఎన్.నాగరాజు, జూలూరి శ్రీధర్, దేశభక్తి శివ పేకాడుతుండగా ఇంతేజార్‌గంజ్ పోలీసులు సోదాలు చేశారు. ఇందులో సోముల సంపత్, పొగాకు రామకృష్ణ పట్టుబడగా, మిగతా నలుగురు పారిపోయారు. వారి నుంచి రూ. 19,750 నగదు ప్లేకార్డులను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ షుకూర్ తెలిపారు.

ఖోఖో టోర్నమెంట్‌కు ఆర్థిక సాయం

గీసుగొండ, మార్చి 29: మండలకేంద్రానికి చెందిన లక్ష్మీనారాయణ ఖోఖో టోర్నమెంట్‌కు రూ. 10 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఒడిశాలో జాతీయస్థాయి ఖోఖో పోటీల్లో పాల్గొనే విద్యార్థుల సౌకర్యార్థం ఖర్చు చేస్తామని టోర్నమెంట్ ఆర్గనైజర్ రాంబాబు తెలిపారు. గీసుగొండ జడ్పీహెచ్‌ఎస్‌లో ఖోఖో శిక్షణ శిబిరంలో క్రీడాకారులకు టీషర్టులను మాజీ ఎంపీపీ కవితా రాజ్‌కుమార్ అందజేశారు. మాజీ సర్పంచ్ దౌడు బాబు, సునీల్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

నర్సంపేట, మార్చి 29: పట్టణానికి చెందిన వేముల రమేశ్ అనారోగ్యంతో మృతి చెందాడు. మృతుడికి భార్య స్వాతి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పుట్టెడు దుఃఖంలో ఉన్న స్నేహితురాలు స్వాతికి మేమున్నామంటూ బాల్యమిత్రులు ధైర్యం చెప్పారు. శనివారం పరామర్శించి స్వాతికి రూ. 50 వేల ఆర్థిక సాయం అందించారు.

ట్విట్టర్ అకౌంట్‌దారుడిపై కేసు

నల్లబెల్లి, మార్చి 29: ట్విట్టర్ అకౌంట్‌దారుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై గోవర్ధన్ తెలిపారు. గుర్తుతెలియని వ్యక్తి ట్విట్టర్ అకౌంట్ ద్వారా నల్లబెల్లి పోలీసుల మనోభావాలు దెబ్బతినేలా పదేపదే సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు. ఈ మేరకు అతడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికి టోల్‌ఫ్రీ నంబర్ 1912

హనుమకొండ, మార్చి 29: విద్యుత్ వినియోగదారుల సమస్యలు పరిష్కరించేందుకు టోల్‌ఫ్రీ నంబర్ 1912 ఏర్పాటు చేసినట్లు హనుమకొండ, వరంగల్ సర్కిల్స్ ఎస్‌ఈలు పి.మధుసూదన్‌రావు, గౌతం రెడ్డి సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఈ టోల్‌ఫ్రీ నంబర్ 24/7 అందుబాటులో ఉంటుందన్నారు. ట్రాన్స్‌ఫార్మర్ల ఫెయిల్యూర్లు, విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు, బిల్లులో హెచ్చుతగ్గులు, ఫ్యూజ్ ఆఫ్ కాల్స్, విద్యుత్ మీటర్ల మార్పు, అన్ని రకాల కొత్త సర్వీసుల మంజూరు, పేరు, క్యాటగిరీ మార్పు, లోడ్ మార్పు తదితర సమస్యలకు టోల్‌ఫ్రీ నంబర్ 1912లో సంప్రదించాలని సూచించారు.

'జాతరలో డీజేలకు అనుమతిలేదు'

సంగెం, మార్చి 29: గుండ బ్రహ్మయ్య జాతరకు డీజేలకు అనుమతి లేదని, నిబంధనలు పాటించని వారిపై చర్యలు ఉంటాయని పర్వతగిరి సీఐ రాజగోపాల్ హెచ్చరించారు. గవిచర్లలో ఏటా ఉగాది పర్వదినోత్సవం సందర్భంగా నిర్వహించనున్న గుండ బ్రహ్మయ్య జాతరపై శనివారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమయ్యారు.

పెద్దమ్మ జాతర పనుల పరిశీలిన

ఖిలావరంగల్, మార్చి 29: ఉగాది పండుగ సందర్భంగా తూర్పు కోటలో నిర్వహించనున్న పెద్దమ్మతల్లి జాతర పనులను శనివారం వరంగల్ ఏసీపీ నందిరాం సీఐ వెంకటరత్నంతో కలిసి పరిశీలించారు. ఆలయం చుట్టూ ఎడ్ల బండ్ల ప్రదక్షిణ నేపథ్యంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. వాహనాలు వచ్చి వెళ్లేందుకు బారికేడ్లు ఏర్పాటు చేయాలని సూచించారు. అలాగే, ఆలయ సమీపంలోని సాహితీ స్కూల్‌లో పార్కింగ్ ఏర్పాటు చేయాలన్నారు.

క్రికెట్ విజేతలకు బహుమతుల ప్రదానం

పర్వతగిరి, మార్చి 29: మండలంలోని కొంకపాకలో మండల స్థాయి కల్చరల్ అండ్ యూత్ స్పోర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఉగాది పండుగ సందర్భంగా దాతల సహకారంతో క్రికెట్ టోర్నమెంట్‌ను 20 రోజులపాటు నిర్వహించారు. శనివారం ఫైనల్‌లో గెలుపొందిన సంగెం జట్టుకు రాయబారపు వివేక్ చేతులమీదుగా రూ. 15 వేల పారితోషికం, షీల్డ్ అందజేశారు. ద్వితీయ బహుమతిగా కొంకపాక జట్టుకు మాజీ ఎంపీటీసీ కరిమిల్ల మోహన్‌రావు, చిట్టిమల్ల వెంకటేశ్వర్లు, కొయ్యాడ రాజు, బొక్కల ప్రమోద్, అలకుంట దేవేందర్ 10 వేలు, జ్ఞాపిక బహూకరించారు.

పేదలకు సేవ చేయడం అభినందనీయం

సరుకులు అందజేస్తున్న ఉర్సు దర్గా పీఠాధిపతి ఉబేద్‌బాబా, వరంగల్ ఏసీపీ నందిరాం, కార్పొరేటర్ పోశాల పద్మ

కరీమాబాద్, మార్చి 29: రంజాన్ మాసంలో ఏటా తవక్కల్ వెల్ఫేర్ ట్రస్టు పేదలకు సేవ చేయడం అభినందనీయమని ఉర్సు దర్గా పీఠాధిపతి ఉబేద్‌బాబా, వరంగల్ ఏసీపీ నందిరాం అన్నారు. ట్రస్టు చైర్మన్ ఎంఏ జబ్బార్ ఆధ్వర్యంలో శనివారం ఫోర్టురోడ్డులోని ఖిలావరంగల్ ఈద్గాలో పేదలకు ఉచితంగా రేషన్‌కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రంజాన్ మాసంలో ప్రతి ఒక్కరూ తోచినంతలో ఇతరులకు సాయం చేయాలన్నారు. జబ్బార్ మాట్లాడుతూ ఏటా రంజాన్ మాసంలో 22 ఏళ్లుగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. 41వ డివిజన్ కార్పొరేటర్ పోశాల పద్మ, మిల్స్ కాలనీ సీఐ వెంకటరత్నం, నాయకులు చాంద్ పాషా, ట్రస్టు సభ్యులు ఇంతియాజ్ ఖాన్, సయ్యద్ షబ్బీర్ సలీం, ఫహీం అహ్మద్, సాదిక్, స్థానికులు హాసన్‌అలీబేగ్, దస్తగిరి పాల్గొన్నారు.

'తల్లిదండ్రులు సక్రమంగా బాధ్యత నిర్వర్తించాలి'

మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి నిర్మలా గీతాంబ

కరీమాబాద్, మార్చి 29: కొందరు తల్లిదండ్రులు తమ బాధ్యతను సక్రమంగా నిర్వర్తించడం లేదని జిల్లా ప్రధాన న్యాయమూర్తి నిర్మలా గీతాంబ అన్నారు. తిమ్మాపూర్‌లోని సాయి ఓల్డేజ్ హోమ్, ఎలగందుల వృద్ధాశ్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ వరంగల్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, మెడికవర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో శనివారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నిర్మలా గీతాంబ మాట్లాడుతూ కుటుంబ వ్యవస్థలో మార్పులు రావడం, ఉమ్మడి కుటుంబ వ్యవస్థ నుంచి చిన్న కుటుంబాలు ఏర్పడడం వల్ల వృద్ధాశ్రమాలు ఏర్పడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. నిర్వాహకులు వృద్ధులను మానసికంగా సిద్ధం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సాయికుమార్, వరంగల్ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ శ్రీనివాసరావు, వైద్యాధికారులు రమ్య, సాయిప్రియ, మెడికవర్ డాక్టర్ పూర్ణచందర్, ఆశ్రమ నిర్వాహకులు పాల్గొన్నారు.

సొసైటీ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలి

మాట్లాడుతున్న పీఏసీఎస్ చైర్మన్ ఎం రవి

చెన్నారావుపేట, మార్చి 29: అమీనాబాద్ రైతు పరస్పర సహకార సంఘం అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని చైర్మన్ మురహరి రవి అన్నారు. సహకార సంఘం 70వ వార్షిక మహాసభను చైర్మన్ అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ముందుగా సీఈవో పులి రమేశ్ వార్షిక నివేదికను సమర్పించారు. రైతులు తీసుకున్న స్వల్పకాలిక రుణాలను ఏటా రెన్యువల్ చేసుకోవాలని చైర్మన్ కోరారు. దీర్ఘకాలిక రుణాలపై 40 శాతం సబ్సిడీ అందిస్తే రుణాలు పూర్తిగా చెల్లించే అవకాశం ఉందని పలువురు సభ్యులు చెప్పగా.. తీర్మానం చేసి డీసీవోకు అందజేస్తామని, వారు ఒప్పుకుంటే కచ్చితంగా అమలు చేస్తామని తెలిపారు.

రైతు సేవలో ముందుండాలి

పర్వతగిరి/కరీమాబాద్: దేశానికి వెన్నెముక అయిన రైతు సేవలో ప్రతి ఒక్కరూ పాలుపంచుకోవాలని పర్వతగిరి పీఏసీఎస్ చైర్మన్ మోటపోతుల మనోజ్‌కుమార్ గౌడ్ అన్నారు. పర్వతగిరి కల్లెడ పీఏసీఎస్ పరిధిలో వార్షిక సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సంఘం వార్షిక నివేదికను ఆమోదించిన సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే, అందరి సహకారంతో ఖిలావరంగల్ సొసైటీ అభివృద్ధికి కృషి చేస్తున్నామని చైర్మన్ కేడల జనార్దన్ అన్నారు. ఫోర్టురోడ్డులోని సంఘం భవనంలో ఖిలావరంగల్ పీఏసీఎస్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జనార్దన్ మాట్లాడుతూ సొసైటీని మరింత అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు విద్యార్థులకు గాయాలు

నర్సంపేట, మార్చి 29: రోడ్డు ప్రమాదంలో ఇద్దరు విద్యార్థులు గాయపడ్డారు. మహేశ్వరం శివారు నర్సంపేట–వరంగల్ ప్రధాన రహదారిపై శనివారం జరిగిన ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. లక్నేపల్లి బాలాజీ ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన విద్యార్థులు శ్రీకర్, ఛత్రపతి శివాజీ బైక్‌పై నర్సంపేట నుంచి కళాశాలకు బయల్దేరారు. మహేశ్వరం శివారులో ప్రధాన రహదారిపై వరంగల్ నుంచి నర్సంపేటకు పండ్ల లోడ్‌తో వస్తున్న గూడ్స్ ఆటో, బైక్ ఎదురెదురుగా ఢీకొన్నాయి. తీవ్రంగా గాయపడిన శ్రీకర్, ఛత్రపతి శివాజీని స్థానికులు అంబులెన్స్‌లో నర్సంపేటలోని జనరల్ ఆస్పత్రికి తరలించారు. ఎస్సై గూడ అరుణ్‌కుమార్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

దివ్యాంగుల సమస్యలను పరిష్కరించాలి

ఖిలావరంగల్, మార్చి 29: వయోవృద్ధులు, దివ్యాంగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ సత్యశారద అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో శనివారం నిర్వహించిన ప్రత్యేక ప్రజావాణికి వచ్చిన 9 దరఖాస్తులను సంబంధిత శాఖలకు ఎండార్స్ చేశారు. సమస్యల పరిష్కారంలో ప్రత్యేక చొరవ తీసుకోవాలని ఆమె అధికారులకు సూచించారు. అనంతరం బేటీ బచావో.. బేటీ పడావో జిల్లా స్థాయి సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీఆర్వో విజయలక్ష్మి, డీఆర్డీవో కౌసల్యాదేవి, జడ్పీ సీఈవో రాంరెడ్డి, డీడబ్ల్యూవో రాజమణి, డీఎంహెచ్‌వో డాక్టర్ సాంబశివరావు పాల్గొన్నారు.

కళాకారులకు ప్రభుత్వ ఉద్యోగాలు ఇవ్వాలి

సమావేశంలో మాట్లాడుతున్న కళాకారులు

పోచమ్మమైదాన్, మార్చి 29: రాష్ట్రంలోని కళాకారులకు ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించాలని ఉమ్మడి జిల్లా కళాకారులకు విజ్ఞప్తి చేశారు. హనుమకొండ పబ్లిక్ గార్డెన్‌లో శనివారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. నాడు పీసీసీ అధ్యక్షుడిగా ఉన్న రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ అధికారంలోకి వస్తే వెయ్యి మంది కళాకారులకు ఉద్యోగాలు ఇస్తామని ఇచ్చిన హామీ నెరవేర్చడం లేదని వాపోయారు. నిరుద్యోగ కళాకారుల గురించి ప్రభుత్వం ఆలోచించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో కళాకారులు పరకాల రమ, పాలాటి రాజు, ప్రభాకర్, ఎర్రోళ్ల స్వప్న, పిట్టల భవాని, పాలాటి రమేశ్, మడిపల్లి కట్టయ్య పాల్గొన్నారు.

మంగళవారిపేట స్కూల్‌లో ఉగాది పచ్చడి తాగుతున్న హెచ్ఎం

ఖానాపురం, రాయపర్తి: జిల్లాలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో శనివారం ముందస్తు ఉగాది వేడుకలు నిర్వహించారు. ఇందులో భాగంగా ఖానాపురం మండలంలోని మంగళవారిపేట ప్రాథమిక పాఠశాల, బుధరావుపేట జడ్పీహెచ్ఎస్, రాయపర్తి మండలకేంద్రంలోని జడ్పీహెచ్ఎస్‌లో వేడుకలు నిర్వహించారు.

సర్వర్‌డౌన్‌తో సమస్యలు

పోచమ్మమైదాన్, మార్చి 29: మూడు రోజుల నుంచి సర్వర్‌డౌన్ అవుతుండడంతో వరంగల్ తహసీల్దార్ కార్యాలయంలో ధ్రువీకరణ సర్టిఫికెట్ల జారీలో సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. చాలామంది కులం, ఆదాయం, నివాస ధ్రువీకరణ పత్రాల కోసం దరఖాస్తు చేసుకుంటే తరచూ సర్వర్‌డౌన్ కావడంతో ఇబ్బందులు తప్పడం లేదు. రాజీవ్ వికాస్ పథకానికి వచ్చే నెల 4వ తేదీ వరకే అవకాశం ఉండడంతో అర్హులు మీసేవ సెంటర్లకు బారులు తీరుతున్నారు.

సర్టిఫికెట్ల కోసం ఎదురుచూస్తున్న ప్రజలు

గ్రూప్–1 ర్యాంకర్‌ను అభినందిస్తున్న దయాకర్‌రావు

మాజీ మంత్రి ఎర్రబెల్లి సుడిగాలి పర్యటన

రాయపర్తి, మార్చి 29: మండలంలో శనివారం మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు సుడిగాలి పర్యటన చేశారు. బంధన్‌పల్లికి చెందిన ఇల్లందుల రాకేశ్ ఇటీవల గ్రూప్–1 ఫలితాల్లో ప్రతిభ కనబర్చగా, ఎర్రబెల్లి అతడికి శాలువా కప్పి అభినందించారు. అలాగే, మండలకేంద్రంలోని గంగపుత్రకాలనీకి చెందిన బీఆర్ఎస్ మండల కార్యాలయ సహాయకుడు పిల్లి కృష్ణకాంత్ ఇటీవల చేపల వేటకు వెళ్లి చనిపోగా, బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చారు. కృష్ణకాంత్ తల్లి స్వరూపకు ఆర్థిక సాయం అందించారు. కొండూరుకు చెందిన బీఆర్ఎస్ సీనియర్ కార్యకర్త మహ్మద్ గుంషావలీ కుమారుడు రషీద్‌ఖాన్ మృతి చెందగా, బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

మంత్రి సురేఖకు మిఠాయి తినిపిస్తున్న కలెక్టర్ సత్యశారద

మైనార్టీల సంక్షేమానికి సర్కార్ కృషి

పోచమ్మమైదాన్/గీసుగొండ/నర్సంపేట, మార్చి 29: మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర అటవీ పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. ఎల్‌బీనగర్‌లో శనివారం ప్రభుత్వం ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఇందులో మంత్రితోపాటు మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు, మేయర్ గుండు సుధారాణి, కలెక్టర్ సత్యశారద, రాష్ట్ర హస్ కమిటీ చైర్మన్ ఖుర్రాపాషా పాల్గొన్నారు. అలాగే, గ్రేటర్ వరంగల్ 16వ డివిజన్‌లో ఏర్పాటు చేసిన ఇఫ్తార్‌లో పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి పాల్గొన్నారు. నర్సంపేట పట్టణంలో నిర్వహించిన ఇఫ్తార్‌లో ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి పాల్గొని రంజాన్ వేడకలను ముస్లింలు సంతోషంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు.

భద్రకాళీ ఫర్నిచర్స్‌లో కూలర్ల ఆవిష్కరణ

పూల మొక్క అందజేస్తున్న గుండా వంశీ

ఖిలావరంగల్, మార్చి 29: శివనగర్‌లోని భద్రకాళీ ఫర్నిచర్స్‌లో కొత్త మోడల్ కెన్‌స్టార్ కూలర్లను ఇంస్టాగ్రామ్ ఇన్‌ఫ్లుయెన్సర్లు (ప్రభావితం చేసేవారు) వరంగల్ శివ, వరంగల్ చక్రి శనివారం ఆవిష్కరించినట్లు షాపు యజమాని గుండా వంశీ తెలిపారు. 70, 105 లీటర్ల కెపాసిటీ, రిమోట్ కంట్రోల్‌తో పని చేసే రెండు కొత్త మోడళ్లు వినియోగదారులకు అందుబాటులో ఉన్నాయని వెల్లడించారు. ఫ్యాన్‌కు అయ్యే విద్యుత్ ఖర్చుతో ఎయిర్ కూలర్‌ను నడుపొచ్చని వివరించారు. బుకింగ్ కోసం 8520052599 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

పేదలకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

ల్యాబర్తిలో ఉచిత వైద్య శిబిరం

వర్ధన్నపేట, మార్చి 29: మండలంలోని ల్యాబర్తిలో శనివారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఇటీవల మృతి చెందిన చెందిన రాచమల్ల ఉపేంద్ర జ్ఞాపకార్థం ఆమె మనుమరాలు డాక్టర్ సిరిచందన ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో రూ. 50 వేల విలువైన మందులను అవసరమైన వారికి ఉచితంగా అందజేశారు. అలాగే, ల్యాబర్తి మిత్రమండలి సభ్యుల సహకారంతో హనుమకొండ మెట్రో పోలీసులు, మహబూబాబాద్‌కు చెందిన శ్రీసత్యసాయి లయన్స్ నేత్ర వైద్యశాల ప్రతినిధులు 200 మందికి నేత్ర వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందించారు. ల్యాబర్తి మిత్రమండలి ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు నోట్‌బుక్స్, స్టడీ మెటీరియల్ అందజేశారు. కార్యక్రమంలో హైకోర్ట